T. S

V. R. LIBRARY
Opp:- V. V. COLLEGE
JAMBAGH, HYDERABAD-500001

V. R. LIBRARY
Book No. 103

# గాజుకిటికీ

పొద్దునే లేచి ఎవరి మొహం చూశాను !

అఁ... సిలకపచ్చ రంగు కోక కట్టుకొని పోయింది, ముసుకేసి కొని. ముండమోసింది కాదుగదా ! కొంపదీసి ... కాదులే ! మొహాన ఇంత పెద్ద బొట్టుందిగా ! ముత్తయిదు బొట్టు. అబ్బ!

పొద్దు పొడిసిందోలేదో గుడ గుడ ... అప్పుడే ఆకలి ! రాత్రే కదా తిన్నది...మళ్ళీ ఆకలి ... పాడు పొట్ట. చేతిలో డబ్బుందీ లేనిదీ దీనికెందుకు ? దీనికోసం ఎన్ని కట్టాలు ?

ఆకలి లేకపోతే ఏ పోలీసోడిన్ని చూసీ భయపడే పనేలేదు. తీసి కొనేమామూళ్ళు తీసికొంటానే బెదిరిత్తారు — వాళ్ళ తాతగాడిసొమ్ము ఎగ్గొట్టినట్టు ...

అబ్బ ! ఆకలి !

ఇప్పుడెలా ? పాడుబల్మ — ఏరోజుకారోజు తిండికక్కుర్తి, రోజా గడపటమే ఒక గండం. ఆడుంచినా బాగుండ్ను ... యాలకింత పడేద్దురు. ఛీ ! ఎదవబతుకు !

ఇకనుండైనా బాగా బతకాలి ! — ఈ రోజుతో ఈ పని మాను కోవాలి.

ఏడుకొండలవాడా ! అంతా నీదయ—నీవు సల్లగ చూసి రెండో కంటబడకూడదు.

సామీ — నీమేలు మరసిపోను — ఈ ఒక్కసారి కాపాడు. మళ్ళీ ఈ పనిసేత్తే ఒట్టు.. ఇయ్యాల సామిదయతో కలిసొత్తే ... కాపు సారాయి కాసుకొని బతకాలి— లేకపోతే ఏంబతుకు నీ యవ్వ...రెండు

రోజులీడ— రెండు నెల్లు ఆడ. పట్టుబడ్డారోజు సున్నంలోకి ఎముకలు మిగలటంలే! కాపు సారాయికేం గిరాకీ! దీని తల్లి సిగదరగ — రాములమ్మ — ఆడది. కాపుసారాయిమీద ఏం సంపాయించింది. కాలుమీద కాలేసుకొని మగసిరిగా బేరం అమ్మింది. ఆ డాబాలు రెండు దానిమీద కట్టించినయ్యేగా! రాత్రిమటుకు రాత్రి — అరకాయ బోసింది, ఆరు రూపాయలు తీసికొంది—అన్నాయంగా వచ్చిన సొమ్ము నిలవదంట — నోటి కడ్డం వచ్చిందల్లా వాగుతారు బుద్ధితక్కువోళ్ళు. నాయం — అన్నాయం — వోడు సూత్తన్నాడు. పోలీసోడి కంటబడకుండ ఎన్నిసార్లు — సైకిలు టూబుల్లో దానికి సారాయి దేలా? ఇప్పుడొక సుక్క అప్పు బొయ్యమంటే ససేమిరా సోటుబెట్టదు— నాయమంట నాయం! ఈరోజు మన నచ్చత్రం మంచిది కావాలి. ఒక పచ్చనోటు గిడితే దానికి యక్స పార్టీ.

సరే. అయన్నీ దొరికినప్పటి ముచ్చట్లు. దొరక్క యాడికి పోద్దీ? రేపటినుండి గల్లాపెట్టెముందు కూసోవాలి,

ఆ ఎన్నిసార్లు ఇట్టనుకోలా! అదీ నిజమే! దీనితల్లి సిగదరగ— పాడుబుద్ధి! దానికంటే కోతి నయం, ఒకప్పుడు కాకపోతే ఇంకోకప్పుడు ఒకసోట కాసుంటది... కానీ బుద్ధి డబ్బు సేతికి సిక్కిందా ఒకపాట ... సిక్కినాక... కానీ ఇయ్యాలమాత్రం అట్టకాదు.

సరేలే. ముందయితే పని కానిద్దాం! తరువాత యాపారం సంగతి ... అరెరే... సూత్తాసూత్తానే పొద్దు రెండు బారలెక్కింది ... అబ్బ... ఒళ్ళు గొడ్డలి మడిమతో సరిసినట్టుంది ... ఒక్క సుక్కబడితే ఒళ్ళు నొప్పులు సళ్ళొదులు... కానీ సుక్కకు డబ్బుంటే ఈ కట్ట మెందుకు — ఆయినా సుక్కెందుకు? సుక్కబడితే పనిసాగదు — ఆయాలకూడా అంతే...సుక్కమూలానే సిక్కిపోవాల్సొచ్చింది,

ఇప్పుడెటు?

టేషన్‌కా?... బస్సుటాండుకా?

K. LIBRARY,
3-4-603 Narayanguda,
HYDERABAD-29. (A. P.)

టేషన్ చాలా దూరం నడవాలి — ఇప్పటికే కాళ్ళు పీకుతున్నాయి.

వాడు ఆ రిక్షాలో పొయ్యేవాడు. ఆయాల అన్నాయం సేశాడు ... ఒకటీ అరాకాదు — మూడు గొలుసులు — ఒకటి చంద్రహారం — రెండు నక్లీసులు. ఇంకేదయినా అమ్మసూపితే యట్టలేదన్నా ఆరొందలు బలుకు — మూడూ కలిపి. రెండొందలు కొట్టేశాడు.

శైనా యుద్ధం మూలంగా బంగారం కొన్నా అమ్మినా బేడీలు బడుతున్నాయంట — శైనావాళ్ళు రాకముందుమాత్రం ఇచ్చి సచ్చిందేముంది? తలలుతీసి తలలు మార్చేరకం. వాడిగీత మంచిదయి యాపారం బాగా కలిసొచ్చింది.

"ఏయ్ కూలీ ... వస్తావా? ..." యాడ - ఎవురు?

"బాబుగారో ... వత్తానండీ ... పెట్టెబెడ్డింగు బస్సుమీద ఏపియ్యమంటారా? ... బాగా బరువుంది ... ఒక పావలా డబ్బులిప్పించండి."

"బేడా ఇస్తారా?"

నాయానికి రోజులు కావు. సిన్న కాయితంమీద సంతకం చేసేది. వందలొందలు లంచాలు నూకుతారు. పొద్దతమానం ఎముక లిరగ్గొట్టుకొన్నా రూపాయి డబ్బు లివ్వరు ... మనపనే హాయి. గిట్టుబాటయితే మారాజులా తిరగొచ్చు.

"ఏయ్ ... కూలీ ... సరే — తీసికో."

అట్టదిగిరా నాయాలా! ఎవుడవసరం! తేరగా పడిఉన్నామా నీ సామాన్లకోసం? అబ్బ మెడ లిరిగిపోతున్నాయి పో ... రోజూ మోసేవాళ్ళు ఎట్ట మోత్తారోగాని ... ఏం చేత్తారు పాపం!

పావలా.

పావలా అంటే నాలుగు సింగిల్ టీలు.

ఒక కట్ట హస్తంబీడీలు ...

కథా నిలయం
శ్రీకాకుళం

ఇంకొక అణా కలిపితే ప్లేటు భోజనం.

ఇంకా ... ఇంకా ... కానీ. ఇప్పుడు మాత్రం ఒక బేడ పునుకులు, ఒక సింగల్ టీ, ఒక అణా బీడీలు. అంతలో బస్సులచుట్టూ జనం పోగవరు. ఎనిమిది దాటితేనేగాని తోసికోరు. అప్పుడు ... అప్పుడు.... అంతలో అటు పొయ్యొద్దాం.

"ఏం అయ్యరూ, ఒక బేడ పునుకులిచ్చి, ఒక సింగల్ టీ కలుపు ... టీస్టాల్ పెద్దది చేశావే, బేరం బాగా గిట్టుబాటుగా ఉందా ?"

యాడసూసినా అరవోళ్ళ వోటళ్ళే ! బతకనేరిసిన వాళ్ళు. మనం ఇంకోదేశంపోయి బతకటమా ? బతకలేం. అందుకనే దరిద్రం. ఈడ తాగటానికి గంజిలేకపోయినా, ఈడ్నేపడి సత్తామంటారు.

"ఏమయ్యోయ్ ! టీ - డబుల్‌స్ట్రాంగ్."

అరె ఛాన్సుపోయె. గుంటూరు బస్సు టాండింగులో కొచ్చింది. జనం ముసురుకొంటున్నారు. ఇప్పటిదాకా ఈళ్ళందరూ యాడున్నట్టు ? ఆతను — అతను - లాల్చీ పక్కజేబులు బరువుగా ఉన్నాయి. పల్లెటూరోడేనా ? అవును. ఏకలప కొంటానికో, పొగనారు కొంటానికో గుంటూరు ఎక్కుతున్నప్పుడే పని కానియ్యాలి. మనిషి లోపలికెళ్ళినాక అనుకుంటే లాభంలేదు. అతడు ఒక చేత్తో కడ్డీ పట్టుకొని యాలాడబడతాడు ముందు ఒకకాలు చెక్కమీదపెట్టి, ఇటువంగి రెండోకాలు తీసికొనేటప్పటికి పనయిపోవాలి, ఇక అనుమానమెందుకు ? లే ...

"ఏమయ్యో అయ్యోరూ ... నీవు టీ తెచ్చేలోకే పొద్దుటాట ఒక సినిమా సూసిరావచ్చే !"

తొందరపడకూడదు. తొందరపడితే పనిపాడయిపోయిందే ... గ్యారంటీ. బస్సులో జనాన్ని దిగనియ్యి ముందు. వాళ్ళు దిగేలోగా టీ తాగి అవతలపడదాం. అత నొక్కడేనా ... ఇంకా ... ఇంకా ...

"అయ్యోరూ ... ఇదిగో గ్లాసు ... అణాతే."

S. K. LIBRARY, 3-4-603, Narayanguda, HYDERABAD-29. (A. P.)



"ఊ.., వెధవలారీ. పోనియ్యి."

"ఒక అణా హస్తం బీడీలు. అర్జెంటు!"

"తోసుకోకండయా...బోలెడంత ఖాళీ ఉంది." అరె అతనెటు బొయ్యాడు?—కళ్ళల్లో కారంగొట్టాడే! తళుక్కున మెరిసి మాయమయ్యాడే? ఓహ్..గోతాలు టాపుమీద ఏపిత్తన్నావ్? సరే రా...

"ఎక్కండమ్మా ... ముందు ఆడవాళ్లెక్కండి అగండయ్యా? ముందు నిలబడ్డ వాళ్ళ నెక్కనివ్వండి" .,. ఆరె — ఆరె ... కడ్డీ పట్టుకొన్నాడు. మనంకూడ...ఊ(...ఇటు..,జేబు..,జేబు...పక్క జేబు. కాదు చెయ్యి—మొద్దు చెయ్యి — ఎడంచేత్తో జేబు గట్టిగా పట్టుకొని ఎక్కుతున్నాడు. తప్పించుకొన్నావ్ గదరా! కత్తెర తెచ్చుకోవాల్సింది. కత్తెరుంటే?...కత్తెరున్నా ఒంటిపాటున మనిషి నిలబడాలి...మంచి చాన్సు పోయిందే...పోయిందంటే మన తప్పేముంది?

పల్లెటూరోడయితేనేం? గుంటూరు, బెజవాడలో జేబులు కొడతారని బాగా ఇనుంటాడు. ఎంత ఇంటేమాత్రం యేం, ఒకసేత్తో ఈ కడ్డీ పట్టుకొన్నట్టు, ఆ సేత్తో అవతలేపు కడ్డీ అందుకొన్నట్టయితే, నాలు తిక్కు...తప్పించుకొన్నాడు లేసి ఎవుడిముహం చూశాడో!

అదికాదులే...మనకే ఈడ శకునం బాగాలే! అటు టేషన్‌కన్నా పోదాం!

అబ్బ - పాడుగవులు - రాత్రి తిన్నాకూడు బయటికొత్తది. మాంచి సిమ్మెంటు రోడ్డుదిగి దగ్గరదోవని ఇటొత్తినే ,.. ఈడ రోజూ ఉండేవాళ్లెట్టా బతుకుతున్నారో! ఓరి దేవుడా! గుడిసెమీద గుడిసె! వానాకాలం సూడాలి ఈళ్ళ బాగోతం. రొచ్చు, గబ్బు, ఆడ్నే కూసుంటారు. ఆడ్నే తింటారు. పందులూ, ఈగలూ మనుషులకు తేడాలేదు. ఏఏడు గెత్తరొచ్చినా ఈ గుడిసెల్లో నుంచే మొదలు. పోయినేడు మడశానికి యాభై పీనిగలెల్లినాయి. అయినా గుడిసెలొదిలి పోరే!

సూడికి పోతార్లే!

వాళ్ళకేం. ఇల్లా వాకిళ్ళా? రెక్కాడితేగానీ డొక్కాడదు. తెల్లారగట్ల లేసి ఇంత కాసుకుతాగి, అకుండా, అబొచ్చా అడపారేసి, పొట్ట సేత్తో పట్టుకొని కూలికి పోతారు. రాత్రికొచ్చి ఆ గుడిసెల్లో పడుంటారు. చావొచ్చేదాకా ఆ మురికిలోనే పడుంటారు. ఇస్త్రీ గుడ్డలేసుకొనే పెద్దమనుషులెవరూ ఇటుకెల్లి రారు. తెల్లటోపీలుబెట్టే మంత్రులు మీటింగుసేసి మాట్టాడుతారు – ఆ గుడిసెల్ని లేపాలని, పోలీసుల్ని పంపి.

ఎటుచూసినా బొయిమని ఈగలు ! ఎవుడో పందికొక్కుని సంపి ఈడపడేశాడు.

"ఏయ్ : రిక్షా ! కళ్ళు నెత్తిమీద బెట్టుకొని తొక్కుతున్నావా!"

చచ్చీచెడీ రిక్షా తొక్కుతారు నెత్తురుబడేట్టు. ఇద్దరు ముగ్గుర్ని ఎక్కించుకొంటారు. ఏం లాభం? పొద్దున్నే ఓపెనింగు, సాయంత్రం క్లోజింగు. బూతద్దంలో సూసి మరీ ఐడియా ఎత్తారు,

ఆ సౌరతీగెల్లుకొన్న గుడిసె – అది...అది సాంబ్రాజ్యానిది – అవును. ఇప్పుడేడుందో ! కప్పు బాగా లేసిపోయిందే ! మొత్తానికి మడిసి మంచిది. ఆ పనిలో ఉండాల్సింది కాదు. ఆ ఎవుడు కోరుకొన్నట్టు వాడు బతికితే ఇదంతా ఎందుకు ? పాపం డబ్బులేని రోజు కూడ ఒంటిమీద సెయ్యేయ్య నిచ్చేది. పోలీసులు పట్టుకెళ్ళారని ఇని ఏడిసిందంట. సామి దయతో కావుసారాయి బేరంగిడితే – దాని సేతిమీదగానే అమ్మించాలి...

ఆరి నీయవ్వ ! ఇటుదాక రేకులు కొట్టారే టేషన్‌కి? ఆ గుంటూరూ బందరు లైన్లు ఇటు జరిపినట్టుంది. టికెట్టు తీసికొనే తెల్లకోటు మనిషి... ఆడొకడు... ఈడొకడు...మెట్లుకాడ్నే కూసున్నారు. లోపలికి పోవటం... వీల్లేధు – చిక్కేవచ్చిందే ! బుకింగు రూముల కెల్లిపోదాం మరి. ఇక్కడెవురు దొరుకుతారు నాపసన్నాసులు ! కుంటి – గుడ్డి – అడుక్కుతినే నాయాళ్ళు పడుంటారు బెంచీలమీద. ఆలోసించటం దేనికి ! రెండడుగు లేసి ఒకదెబ్బ సూత్తే పోలా !

"బాబూ ఒక పైసా యెయ్యి దొరా ! ... అయ్యా నీకాళ్ళ

మొత్కుతా !" అనుకున్నట్టే - అంతా అమాంబాపతు ! ఈడ పడిగాపులు గాసే పాసింజర్లు కూడా వీళ్ళకు తోడుబోయినవాళ్ళే - తిండికీ తిప్పలకీ నకనకలాడి కొంపచేరతారు.

ఇంకా హైద్రాబాద్ బండికి బుక్కింగు తియ్యనట్టుంది ! టైం ? ఎనిమిది కాలేదు. బుకింగ్ తెరిసేలోగా ఒక రౌండు గొడదాం.

ఆ ... ఆడమనిషి, పిల్లలకు సద్దిబువ్వ పెడుతోంది మామిడికాయ పచ్చడేసి. మెడలో గొలుసులు బంగారమేనా ? అయినా పట్టపగలే ... కాదులే. ఆమూల బెంచీమీద ఉన్నవాళ్ళు ... ఆయన బడిసెప్పుకొనే పంతులు. ప్చ్ ! నల్గురాడపిల్లలు. గూడమీద లాల్చీ కుట్టించుకున్నాడు :.. ప్చ్ ! ఇటున్న మనుషుల్లో ...;

ఆడ మరుగుదొడ్లు వాటికి ముందు బెంచీమీద ..., ఆకాళ్ళు ... ఆడమనిషా ... మగమనిషా. .సొటుగా పడుకొన్నాడే ? మామూలు బట్టలు మరి సొటుగా, చెప్పులు బోసేకాడ ఎందుకు పడుకున్నట్టు ... జేబుమీద సెయ్యి బెట్టుకొని !

ఎనిమిది కావచ్చినా, దొర. నిద్రలెగవలా ? రాత్రంతా నిద్రబట్టి ఉండదు - డబ్బు ! డబ్బుంటే నిద్రకూడ రాదు. దీని తల్లిసిగదరగ ! మనిషిని చేదగ్గులా పీలుసుద్ది డబ్బు. మరి గుడ్డల వాలకం సూత్తే ,... ఈ గుడ్డ లేసుకుంటే పైకం పసికట్టదని ఎత్తు. ఈ ఎత్తులు మనకాడ్నా ! - ఇంతకీ ఆ సేతికింద డబ్బుందా ? ఊరికినే పడుకొన్నాడా మరి ? సెయ్యి తీత్తేగానీ తెలియదు.

"ఏమయ్యో ! జరుగు, కొద్దిగా కాళ్ళు ముడుసుకో. ఇంత పొద్దెక్కినా నిద్ర సరిపోలా ?"

రాత్రి రెప్పపాటులో బండి తప్పిపోయిందా ? రాత్రంతా కళ్ళమీద కునుకు లేదా ! తెల్లతెల్లారంగానే కన్నుమూశావా ? ... అప్పుల్లే డబ్బు - డబ్బుంటే నిద్రబట్టిచావదు.

ఓస్ ...: నల్లటి పర్సు ... ఎంతలావుంది - పెద్ద పర్సు ... వందలు ... వేలు కాదుకాని .... వందలు - సందేహంలేదు. దక్కించు కోవడం మన సేతిలో పని. ఆ బస్సుటాండులో ఏముందిమన్సు ? అంతా సామిదయ - సామి మొక్కు తీరుసుకోవాలి.

"మంచిది. పడుకో. పెద్దమనిషివి. ఏమిలేదు. కొద్దిగా కూకొంటా నికి ... పడుకో - పడుక్కో."

పది నిమిషాలు కానిద్దాం. ఇంతలో మళ్ళీగుర్రుకొడతాడు. అప్పుడు ... అప్పుడు ... సిన్నగా జేబుమీద ఏసుకున్న సేతిని జారగొట్టాలి. మోచెయ్యి వాలుగాబెట్టి ఆ పని చెయ్యాలి. కుడిచెయ్యి బుజంమీదుగా పోనిచ్చి, ముందు రెండు వేళ్ళతో అంటీ అంటనట్టుగా లాగాలి. ఆ తరు వాత ఎలా ?

రెండో మనిషి కావాలి. మనం కూసున్న సోటునుండి ఒక బెత్త అటూ ఇటూ జరగకూడదు అవసరం లేనప్పుడు పతినాయాలూ వూరికినే కనబడతాడు. అసలు యాలొచ్చినప్పుడు నల్లబూసలై పోతారు. ఇప్పుడెట్టా? మనిషికోసం పోతే అసలోడులేసి అవతలబడితే ...

"ఒరేయ్ - యాపుల్లలూ - ఇటురా - నేనురా - నన్ను మరిసి పొయ్యావురా ?"

ఏ అమ్మ కులంసెడి కనిపారేసిందో ! అడుక్కుతిని, పుల్లలమ్ము కొంటూ ఈ టేషన్‌లో పండుకుంటాడు.

అటుపోదాం - రా రేకుల పక్కకు."

ఈ డ్నాయితే ఎవరూ అనుమానపడరు. సెప్పింది సెప్పినట్లు సేశాడంటే మన దరిద్రం తీరుద్ది.

"నీవు నా పక్కన సిమ్మెంటు బెంచీ కానుకొని నుంచో. తెలి సిందా? పక్క జేబుందా?...అంతే...యాడ ఆగకుండ, ఇంజన్లు నీలు బోసు కొనేకా బొగ్గు కుప్పల నీడకుపో. సరేనా? అటయిపోయిరా!"

పది నిమిషాలు అయినయ్యా? తొందరపడకూడదు...పది నిముషా లయినా వాడు గట్టిగా బుస గొడుతున్నాడో లేదో సూడాలి. అప్పుడు.

ఇంతకీ ఆ పర్సులో పందలున్నాయా? ఉన్నవో లేవో కొట్టినాక గానీ తెలియదు. ముఖం సెమట పట్టిందిలే మళ్ళీ. నోరుకూడ సన్నగా తెరుసుకొన్నాడు సచ్చినోడులాగ. ఇక కానియ్యి. ఎవడన్నా సూత్తన్నా డేమో...ఒకసారి ... ఇట్ట బయపడితే ఇక పనయినట్టే ... ఎనకాముందు సెయ్యటం అసలు ఈ పనికే తగవు.

బయమా? మన జన్మలో బయపడమే పోలీసోల్లొచ్చినా సరే! మరి ఇంకేంది? ఎందుకైనా మంచిది ఆలోసిచ్చి సేత్తే? ఆలోసించు..ఁఅసలు పనికంటే దీనితోనే ఎక్కువ సావు. ఈలోగా అసలోడు లేవనేలేత్తాడు. అదీ నిజమే...మరింకేంది అనుమానం? అనుమానం కాదుగానీ ఏదయి తేనేం పని సెడగొట్టడానికి? పని కానిచ్చి ఆలోసిద్దాం. సరే—ఎవుళ్ళ యినా సూత్తన్నారా? ఆ ఆడమనిషి పిల్లలకు సేతులు కడుగుతోంది. వాళ్ళకీ సిమ్మెంటు గోడ అడ్డం. అటువాళ్ళకు దిమ్మెలడ్డం. ఇటు మరుగుడు దొడ్లు. ఈపక్క బుకింగు రూమ్. ఇక కానిద్దాం...

సెయ్యి మెల్లగా ... అయిపోయె...మెల్లగా...బరువుగానే ఉంది. ఎవుళ్ళయినా సూత్తన్నారా ! ఎందుకు సూత్తారు!—మన అనుమానంగానీ. ఎవళ్ళ తొందరలో వాళ్ళుంటారు. ఈమాత్రం దానికి పెద్ద హంగామా. ఏమైనా కదులుతున్నట్టా? ఏమీలేదు. మనలోకంలో లేడు. కరువుబట్టినట్లు నిద్రబోతున్నాడు.

ఏమో నమ్మిందెవుడు? ఒకవేళ లేత్తే? ఈ పిల్లగాడేడీ? నమ్మి సెడితినే. పిల్లగాడెందుకు లేసిపోతే ... ఆ వత్తన్నాడులే! పక్కకు జరుగుదాం. కూసోబెట్టి పక్కజేబులో బెట్టాలి.

"ఏరా ! ఎన్ని పుల్లలమ్మావ్ ? రెండు యాపపుల్ల లిటుతే... ఇకపో."

మన సౌరంతిలో లేదు. నాసామిరంగ! రోజూ ఇట్టాంటి మనుషులు దొరికితే. నెలదిరక్కముందే మేడకడుదుం. లేసిపోదాం. యాడా మనిషి దూరటానికి సందులేకుండా కొట్టారే రేకులు! చిన్నపిల్లగాళ్ళేగానీ మనం దూరలేం. బారుకు పడిసిపోయి వాడ్నే బయటికి పిలుద్దాం. వాడున్నాడో-లేకపోతే...మనకు మస్కాగొట్టి వాడేడికి పోతాడులే ఈ ఊళ్ళో. ఆ పప్పులు మనదగ్గర్నా? ఏమో డబ్బు...డబ్బు సూత్తే పెద్ద పెద్దోళ్ళు అబద్ద సాచ్చాలు సెబుతారు కోర్టులో. ఆ...ఉన్నాడులే సైగచేసి, ఇటు పిలుద్దాం...

"ఏందిరా? బొగ్గు కుప్పలో బెట్టావ్? సరే తీసకరా...

"బాగా దొరికావురా నాకు. ఎవుడూ అనుమానపడకుండా బొగ్గు కుప్పలో దాశావ్! ఆ నలుపూ ఈ నలుపూ కలిసపోతాయిలే. తెలివిగలవాడివే...ఇటుతేరా!!"

ఎవుడన్నా సూత్తన్నాడా? సూత్తేనేం ఈ పర్సు నాది కాదనటానికి దమ్మేవడికుంది? పొడుగుమాత్రం బాగానే ఉంది మూడు మడతలతో. ఓరీ నీయవ్వ! ఇది రైల్లో యాలంపాట పాడేది. ఎవుడో బిల్లరేసి ఈడికి అంటగట్టి ఉంటాడు! పర్సు అణాకానీ దయితే మనకెందుకూ? బేడడయితే మన కెందుకు?

"కూసోరా...సాటు కూసో."

అరె ... రెండు రూపాయల నోట్లు రెండు ... మాసిన రూపాయి నోటు...సిల్లర...

"సిల్లర లెక్కబెట్టరా."

అరవై రెండు పైసలా? అంతేనా? ఈ పైన అరలో? ఇదేందో మనియార్డరు రసీదు. ఈ క్రింది అరలో కార్డు, టిక్కెట్టు.

అరె! సచ్చీసెడి యింతపని సేత్తే కట్టమంతా ఊరకనే బోయె! ఇదిలిత్తే మట్టుకు - ఏముంది? బొంద! పర్సు మాత్రం ఇంత పొడుగున ఉంది. ఒకసేరు సెనగపప్పు పోసికోడానికి. ఈ మూల సినిగిపోయినచోట

దారపుకుట్లు. ఈడేమన్నా తీసుంటాడా ? అంత దయిర్నమా ? ఐదు రూపాయల కోసం అయిదొందల శాకిరిసేత్తిమే ! చా ! మన హయాంలో ఎరగం ఇంత పొరబాటు పని. సరే. మనం అనుకున్నట్టు జరిగితే మారాజులం కాకపొయ్యేం ?

ఇంతకీ, ఈ పిల్లనాయాలు కెంత ఇద్దాం ? వాడికి మనకులానే ఆశ. ఆ సూపుసూడు ఇత్తావో - ఇయ్యావో అని అనుమానంగా సూత్తన్నాడు. సిల్లర లెక్కసూడరా ! అంటే సూసి గుప్పిట్లోనే ఉంచుకొన్నాడు. వాడిబాగం అంతకన్న ఉండదనే వాడి నమ్మకం - పిచ్చినాయాలు !

"ఒరేయ్. ఆ సిల్లర నువ్వుంచుకో."

కడుపు లోపలికి పోయింది. ఎప్పుడు తిన్న తిండో! రైలుటేషన్లో ఎంగిలాకులేసే కంతలో సెయ్యిబెట్టి మెతుకులు ఏరుకుంటాడు. వాటిని మాత్రం ఈడికి దొరకనిత్తారా ! తోసి పారేత్తారు. తిండిలేక ఎదుర్రొమ్ము ఎండుకుపోయింది. ఆ తలమీద బొచ్చు నూనెలేక రాగి బొచ్చయింది. ఆ కాకి నిక్కరు, పిర్రలమీద బారుకు సిరిగిపోయింది.

ఇంకొక రూపాయిద్దాం. ఈయాలన్నా కడుపునిండా తింటాడు. అయితే, మనకు మిగిలేది ! నాల్గు రూపాయలేగా ? మరి ... మరి ! దీనికింకా ఎనకా ముందెందుకు - ఒక రూపాయికాడ - ఎదవది ? మనం ఇయ్యాల కాకపోతే, రేపు సంపాయిత్తాం. వాడికి అడుక్కున్నా వంద మంది పైసలిత్తేగదా ! ఇట్ట జేబు గొడితే "మన మేనాడో బాకీ వాడికి" అనుకొంటారు. కానీ, వాళ్ళ సేతిమీదుగా ఒక పైసా ఇయ్యడానికి సత్తారు.

"ఒరేయ్ - ఈ రూపాయికూడా తీసికో ! ఇదిగో ! రేపు సేతికి తడి తగిలితే గుడ్డలు కుట్టిత్తాలే."

మరి ఈ ఎదవ పర్సు ఆ బొగ్గు కుప్పల్లోకి ఇసిరితే ? ఇసరకపోతే? ఎవుడికన్నా ఇత్తే బాగుంన్నాడు ? తలకుమాసిన నాయాలు - ఐదు రూపా

యలకు కూడ పెద్ద పర్సు ! ఇంతకీ ఏ ఊరికెళ్ళామని బయలుదేరాడో ? ఇక ఒకటే ఊరు ... నెత్తిన సెంగేసుకొని వచ్చిందోవనే ఎనక్కి. ఆరె ! హైద్రాబాద్ ? ఎర్రగీత గీసుంది. మెయిలు బండికి. ఇంకేం హైద్రాబాద్ ? లేసి సూసుకొని లబోదిబో !

ఈ కార్డు ... అబ్బ ! ఏం రాత ! సవాలచ్చ వంకర్లు ! ఈ రాసి నోడికంటే మనమే నయం రాతకు ... "దుక్కిబోయినచి నరామయ్యకిచ్చేది." ఏందో సదివి అవతల బడేద్దాం. ఈ మొదట రాసిన అచ్చరాలు ఏందీ - గొలుసుకట్టే - సరేలే.

నమస్కారములు చేసి వ్రాయునదేమనగా - మనతల్లి పాపం బాగులేదని లోగడ రాయించితిమి. ఆ సంగతే మల్లీ రాయించుతున్నాము. అమ్మకు పచ్చవాతం మూలకంగా కాలూ జెయ్యీ పడిపోయి మంచాన పడిపోయి మంచానపడింది. నిన్నటినుండి నోరుకూడ పడిపోయింది. నోరున్నప్పుడు నిన్ను సూసిసచ్చిపోతాను; ఉత్తరం ఏపియ్యమనీ సెప్పింది. అమ్మ ఇక రోజుల్లో మనిషి. నీవు గాపకంవచ్చినప్పుడల్లా మమ్ముల్నందర్నీ సూసి తల అటూ ఇటూ కొట్టుకొంటుంది. అమ్మ సివరి రోజుల్లో అందరమూ ఉన్నాం. నీవు ఒక్కడివే లేవు. నీవు ఉత్తరం ముట్టిన వెంటనే బయలుదేరి రా. లేకపోతే నీకు సూపు అందదు. ఈయాల నీచార్జీకోసం పదిహేను రూపాయలు మనియాడరు కట్టినాము. నేను పదిరోజులపాటు దొరదగ్గిర సెలవు అడిగి అమ్మకాడ్నే ఉంటున్నాను.

ఇట్లు,

"చిన్నతమ్ముడు—కొండయ్య వ్రాలు."

ఇదుగో మనియార్డరసీదు. పదిహేను రూపాయలు టికెట్టుకు పోగా మిగిల్నయిదు రూపాయిల సిల్లర. కన్నకడుపు ! ఆ ముసిల్దాని పాణం ఎంత కొట్టుకులాడుతుందో? ఎంత పాపాకారాని కొడిగట్టాను — పొద్దు పొద్దున్నే ? నీయవ్వ - ఎంత పాపం సేసికొన్నానో ! ఆయాల అమ్మ సచ్చేయాలకు జైల్లోపడి ఉన్నా. 'కొడుకా ! కొడుకా!' అని కొట్టుకులాడి

పాణం ఇడిసిందంట. నామీద దిగులేసుకొని, సేదగ్గు తెచ్చుకొని సచ్చింది. పాడుజల్మం! ఎంతమంది నిట్టా తల్లీ బిడ్డలను ఏరుచేశానో ! సచ్చేటప్పుడు నికుట్టపు సావుసత్తా. నాలిక పీక్కపోతున్నా సుక్కనీరు గొంతులో పోసే వాడు లేక దావాద్రితో సత్తా !

ఈయాల ఈడు బండి కెల్లకపోతే ఈడి ఉసురు నాకు తగులుద్ది. ఎట్టా...టికెట్టుగూడ ఇందులోనే దాసుకొన్నాడే? టికెట్టు ఉంటేమాత్రం అవతల పోటానికి? ఎదవది, పాడుత్తరం సదవకపోయినా బావుండేది. మనస్సు సివుక్కుమన్నది.

సదివితే మాత్రం వాడి డబ్బు వాడి కియ్యాలని యాడుంది? పెపెంచంలో ఎన్ని అన్నాయాలు జరగటం లేదు? మనిషిని ఇంకో మనిషిని ఇంకో మనిషి దోసుకొని తింటున్నాడు. అవుననుకో...కానీ, ఈయాల...ఇది నాయంకాదు. కూలి సేసుకొని బతికేవాడి పొట్టగొడితే సచ్చి స్వర్గంలో ఉండే అమ్మ మెచ్చదు. ఆడూ ఆడి తల్లి సివరిసూపు అందుకోబోతున్నాడు. ఇది పాపకారం. వాడి డబ్బు వాడికిచ్చెయాలి.

మరి...ఈ పిల్లగాడేడీ? ఆడీపాటికి పప్పుచెక్క, పునుగులు కొనుక్కొని పంపుకాడ నీలు తాగుతూంటాడు టేషన్లో.

సరే...మిగతా డబ్బులిచ్చేద్దాం. ఆడు ఈపాటికి లేసుండడు. సిన్నగా వాడి పక్కలో జారిడుద్దాం...ఏమో ! మేలుకుపోతే కీడు ఎనకాలే వత్తదంట. పోలీసులకు పట్టిత్తే? పట్టిత్తే మానా ! ... మనకేమన్నా కొత్తా?—నాయంగా మాట్లాడితే ఈ సొమ్ము ఆడిదేగా. ఆడిసొమ్ము ఆడికియ్యటానికి ఎనకాడటమెందుకు?

టేషన్లో గంట కొడుతున్నారు. అదే హైద్రాబాద్ బండికేనా? కాలు సాగిద్దాం. వాడు లెగవకముందే ఆడ పారేద్దాం.

ఎర్రటోపీలు ! బుకింగు దగ్గర నిలబడటానికా? బుకింగు దగ్గరకయితే ఒక్కడు సాలు ... మరి? మనకోసం కాదుగదా? ... ఏమో

సూద్దాం. వాళ్ళంతా గుంపుగా ఏంచేత్తన్నారు — ఆ బెంచి సుట్టూ? ఆడు నిద్రలేసి ఏడుత్తన్నాడు. పై పంచతో కళ్ళు తుడుసుకొంటున్నాడు.

ఆడు నన్ను గుర్తుబట్టాడా? ... లేదులే ... ఇప్పుడెట్టా? ఆపోలీసోడు మోకాలిమీద బొక్కుపెట్టి రాసుకొంటున్నాడు. ఆ గుంపు ఎనక మాల నిలబడదాం.

సారల పైజమా—మాసిన చొక్కా—ఎర్రగా బొద్దుగా ఉన్నాడు. పోలీసోళ్ళకు గుర్తులు సెబుతున్నాడు. సిన్నపిల్లగాడిలాగా ఏడుత్తన్నాడు. వాళ్లమ్మను సూడలేనని మరికాత్త గుండె బేజారయింది పాపం!

ఆడు నన్ను గుర్తుబట్టాడు.

ఇటొత్తన్నాడు.

"ఇదిగో!"

పర్సు ఊడదీసి సూసుకొంటున్నాడు—టికెట్టు — వాడి పాణం లేసొచ్చింది. రశీదు—ఉత్తరం — రెండు మాసిన రెండు రూపాయల నోట్లు—మిగతావి?

మొకం నల్లబడిపోయింది. రూపాయినోటు, సిల్లర—సెబుదాం.

"కరుసు బెట్టుకొన్నాను."

కాలరు గట్టిగా పట్టుకొన్నాడ్రా! "పద టేషన్‌కి నడవరా!—" పారిపోతాననుకొన్నారు. బొక్కలో తోత్తారంట—మనకేమన్నా కొత్తనా!

"అబ్బ!"—లాటీ కర్రతో డొక్కడో పొడిశాడ్రా! — పొద్దున్నే లేసి ఎవురి మొహం సూశానో!